క్లుప్తంగా

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూలు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వకు ఆదివారం 159 క్యూసెక్కులు విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 0.121 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు వేలం పాటలు

గూడూరు: మున్సిపల్ పరిధిలోని వారపు సంత మార్కెట్, పెద్ద పశువుల మార్కెట్, పెద్ద పశువుల కమేళకు సోమవారం బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

నేడు సచివాలయం, హెల్త్, ఆర్‌బీకే కేంద్రాల ప్రారంభం

కోడుమూరు రూరల్: కోడుమూరులోని కోటవీధిలో రూ.కోటిన్నరతో నిర్మించిన గ్రామ సచివాలయం-3, రైతు భరోసా కేంద్రం-4, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్-2 భవనాలు ప్రారంభానికి ముస్తాబయ్యాయి. ఈ మేరకు నూతన భవనాలను సోమవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ సతీష్ హాజరవుతారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని క్రిష్టారెడ్డి పిలుపునిచ్చారు.

కోలుకోలేక వృద్ధుడి మృతి

పాణ్యం: మండలంలోని గోనవరం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు కోలుకోలేక మృతి చెందాడని ఎస్‌ఐ అశోక్ తెలిపారు. గ్రామానికి చెందిన గుండాల చిన్న మాదన్న (83) భార్య మూడు నెలల క్రితం మృతి చెందింది. దీంతో ఒంటరైన ఆయన జీవితంపై విరక్తి చెంది శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న వివిధ రకాల మాత్రలను మింగడాన్ని గుర్తించిన బంధువులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడని చెప్పారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

బండలాగు పోటీల విజేత ఉయ్యాలవాడ వృషభాలు

గడివేముల: మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఆరు పళ్ల ఎడ్ల బండలాగు పోటీల్లో ఓర్వకల్లు మండలం ఉయ్యాలవాడకు చెందిన సుధాకర్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.40 వేలు బహుమతిని అందుకున్నాయి. భోగేశ్వరం ఆలయం పరిధిలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోటీలు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరాహోరీగా జరిగాయి. రెండవ బహుమతి వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం లింగాపురం చెందిన పద్మావతి వృషభాలు గెలుచుకోగా రూ.30 వేలు అందజేశారు.మూడవ బహుమతి బనగానపల్లె టంగుటూరు చెందిన బీరం రమాదేవి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలను దువ్వూరు మండలం దాసరిపల్లెకు చెందిన సుదర్శన్ ఎద్దులకు అందజేశారు. ఎద్దుల యజమానులకు ఆర్‌జీఎం విద్యాసంస్థల అధినేత మిద్దె రఘురాం, ఆలయ చైర్మన్ ఐసాని సునీల్‌కుమార్‌రెడ్డి, మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, ధర్మకర్తలు పరమేశ్వరరెడ్డి, సురేంద్రనాథ్ రెడ్డి బహుమతులను అందజేశారు.

ఉత్కంఠభరితంగా కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి కబడ్డీ పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మొత్తం 20 జట్లు పాల్గొన్నట్లు నిర్వహకులు తెలిపారు. ఇందులో కాల్వబుగ్గ జట్టు తొలిస్థానంలో నిలువగా రూ.30 వేలు ప్రదానం చేశారు. రెండవ స్థానంలో నిలిచిన శకునాల జట్టుకు రూ.20 వేలు, మూడవ స్థానం సాధించిన కాల్వబుగ్గ-2 జట్టుకు రూ.15 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన ఓంకారం జట్టుకు రూ.10 వేలు, ఐదవ స్థానం హుసేనాపురం జట్టుకు రూ.6 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

నేత్రానందం.. బుగ్గ రామేశ్వరుడి రథోత్సవం



రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: కాల్వబుగ్గ దేవస్థానంలో భ్రమరాంబిక దేవి, బుగ్గ రామేశ్వరస్వాముల వారి రథోత్సవం భక్తులకు నేత్రానందం కల్గించింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వహించిన రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు. ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, ఉత్సవ కమిటి చైర్మన్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా రథానికి ఆలయ అర్చకులు రథాంగ బలి, రథాంగ హోమం, నిర్వహించారు ప్రత్యేక పూజలు చేశారు. సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్ బాషా, ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు చంద్ర పెద్దస్వామి, గోపారమణారెడ్డి, కాల్వ సర్పంచు పెద్ద వెంకటేశ్వర్లు, రామ్మోహన్‌రెడ్డి, జీకే వెంగన్న, గంధం వెంకటేశ్వర్లు, పి.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు, ఎమ్మెల్యే కాటసాని



సమావేశానికి హాజరైన మహిళలు

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- మండలంలో 4,160 మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి

కల్లూరు: మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటు అందిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కల్లూరు మండల పరిషత్ ఆవరణలో వైఎస్సార్ చేయూత నాలుగవ విడత మెగా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏపీఎం శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ బోయ శారద ముఖ్య అతిథులుగా హాజరై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సులోపు ఉన్న మహిళలకు వైఎస్సార్ చేయూత పథకం మెగా చెక్కును అందించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. యన మాట్లాడుతూ చేయూత నాలుగవ విడత కింద మండలంలో 4,160 మంది మహిళలకు రూ.7.80కోట్లు ఖాతాలో జమ చేస్తున్నామన్నారు. అందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్పొరేటర్ నారాయణరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ కేశవరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ద ఈశ్వరయ్య, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి పాల్గొన్నారు.



కల్లూరులో మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: రాష్ట్రంలో మహిళల భవిష్యత్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొండంత ఆర్థిక భరోసాను కల్పించి, వారి జీవితాలలో వెలుగులు నింపారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పొదుపు భవన్ ప్రాంగణంలో 4వ విడత చేయూత పథకం కింద మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మల్లీశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, మండల ఉపాధ్యక్షులు పద్మనాభరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగేళ్లలో మండలంలో 4,033 మంది లబ్ధిదారులకు రూ.28.03 కోట్లు మంజూరు చేశామన్నారు. నియోజకవర్గంలో నాలు మండలాలకు కలిపి రూ.94.20 కోట్లు విడుదల చేశారని తెలిపారు. అనంతరం వైఎస్సార్ చేయూత పథకం మెగా చెక్కును మహిళలకు అందజేసి, జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచు నాగేశ్వరమ్మ, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎం వెంకటరామిరెడ్డి, లోటర్ బాషా, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

గ్రామాల అభివృద్దే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం లక్ష్మీపురం నుంచి దొడ్డిపాడు గ్రామానికి రూ.కోటితో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ, అలాగే రూ. 61లక్షలతో జగనన్న కాలనీ, గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్‌ల ప్రారంభించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని, ఎంపీపీ బోయ శారద ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, ఫక్రుద్దీన్, మన్సూర్ అలీ, హనుమంతురెడ్డి పాల్గొన్నారు.

కోలుకోలేక బాలుడి మృతి

కల్లూరు: మండలంలోని దొడ్డిపాడు గ్రామానికి చెందిన పింజరి మహమ్మద్ రఫీపై ఈ నెల 5న హత్యాయత్నం జరిగింది. మూడు నెలల క్రితం అదే గ్రామానికి చెందిన ఖలీల్ బాషాతో పొలం దగ్గర గొడవపడ్డారు. పెద్దలు పంచాయితీ చేసి ఖలీల్ బాషాను కొన్ని రోజులపాటు భార్య గ్రామంలో ఉండాలని చెప్పారు. ఆ విషయాన్ని మనస్సులో పెట్టుకున్న ఖలీల్ బాషా ఈ నెల 5న స్కూల్ దగ్గర వాకింగ్ చేస్తున్న మహమ్మద్ రఫీపై కత్తితో దాడి చేశాడు. గాయపడిన రఫీ (17)ని కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. ఉలిందకొండ పోలీసులు హత్యాయత్నం కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ గుర్రప్ప ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దార్ ఉదయ్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ అనుపమ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారులు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా సాధికారతకు ప్రాధాన్యం

- చేయూతతో మహిళలకు ప్రభుత్వ తోడ్పాటు
- మొదటి మూడేళ్లలో రూ.27.93 కోట్ల లబ్ధి
- నాల్గవ ఏడాది రూ. 10.31 కోట్ల ప్రయోజనం
- నేడు కర్నూలు రూరల్ మండలంలో చేయూత సంబరాలు
- హాజరుకానున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు సమన్వయకర్త ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్ రెడ్డి

కర్నూలు సిటీ: 'మహిళలు బాగుంటే...కుటుంబం బాగుటుంది. కుటుంబం బాగుంటే ఆ గ్రామం బాగుంటుంది. గ్రామాలు బాగుంటే..రాష్ట్రం బాగుంటుంది' అని నమ్మిన సీఎం వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచీ అక్క చెల్లెమ్మల సంక్షేమమే లక్ష్యంగా మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తున్నారు. అక్క, చెల్లెమ్మల అభ్యున్నతి, వారి జీవన ప్రమాణాలు, జీవనోపాధులను అభివృద్దే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. మహిళల సమగ్రాభివృద్ధి, ఆర్థిక సాధికారతలో భాగంగా 45 నుంచి 60 ఏళ్ల లోపు కలిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళల సంక్షేమం లక్ష్యంగా 'చేయూత' పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఏడాదికి రూ. 18,750 చొప్పున నాలుగు ఏళ్ల పాటు ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం వైఎస్ఆర్ చేయూత ద్వారా మహిళల బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు బదిలీ చేస్తుంది. 2020-21 నుంచి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారు. వైఎస్ఆర్ చేయూతకు అదనంగా వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ రుణాల సదుపాయం కల్పించడంతో పాటు బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా మహిళలను ఆదుకుంటోంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఇప్పటి వరకు మూడేళ్లు చేయూత కింద విజయవంతంగా మహిళల అభ్యున్నతికి ఆర్థిక తోడ్పాటు ఇచ్చింది. ఈ నెల 7వ తేదీన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా నాలుగో విడత చేయూతను బటన్‌నొక్కి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీలకు చెందిన మహిళలు సోమవారం రాయలసీమ యూనివర్శిటీ దగ్గర, పసుపుల సచివాలయం సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాలులో సంబరాలను నిర్వహించనున్నారు.

నాలుగేళ్లలో రూ.38.24 కోట్ల ఆర్థిక తోడ్పాటు...

మహిళలకు ఆర్థిక తోడ్పాడును అందించేందుకు 45 నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం వైఎస్ఆర్ చేయూత కింద ఆర్థిక తోడ్పాటును అమలు చేస్తుంది. కర్నూలు రూరల్ మండల పరిధిలోని మహిళలకు చేయూత కింద 2022-23 వరకు రూ.27.93 కోట్లు ప్రయోజనం కల్పించారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.10.31 కోట్లు విడుదల చేశారు. మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల మహిళలు 5497 మందికి ఆర్థిక లబ్ది చేకూరుతోంది. 4వ ఏడాది చేయూత ద్వారా ఎస్సీ మహిళలు 1707, ఎస్టీ మహిళలు 38, బీసీ మహిళలు 3545, మైనార్టీ మహిళలు 203, క్రిష్టియన్స్ మహిళలు 04 మంది ప్రయోజనం పొందుతున్నారు. వైఎస్ఆర్ చేయూత నిధుల విడుదలను పురష్కరించుకొని నేడు నిర్వహించనున్న సంబరాల్లో వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డితో పాటు, ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, తదితరులు హాజరుకానున్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- అక్కాచెల్లెమ్మలు ఆర్థికాభివృద్ధి ధ్యేయంగా జగనన్న పాలన
- బాబు మాయ మాటలు నమ్మొద్దు
- కోట్ల హర్ష, డాక్టర్ సతీష్

కోడుమూరు రూరల్: మహిళా సాధికారతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఇన్‌చార్జి డాక్టర్ సతీష్ తెలిపారు. అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్దే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఆదివారం కోడుమూరులోని వాసవీ కల్యాణ మండపంలో ఏపీఎం పుష్పావతి అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్ చేయూత నాల్గవ విడత కార్యక్రమానికి కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ రూతమ్మ ముఖ్య అతిథులుగా హాజరై మహిళలకు మెగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మహిళలంతా ఆర్థికాభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో జగనన్న పాలన సాగిస్తున్నారని, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన, విద్యా వసతి వంటి పథకాల ఫలాలను నేరుగా మహిళలకే అందజేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ హాయంలో ఏ పథకం పొందాలన్న నాయకులు, జన్మభూమి కమటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలు, వలంటరీల ద్వారా దళారీ వ్యవస్థ లేకుండా బటన్ నొక్కితే నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోనే నగదును జమ చేస్తున్నారన్నారు. ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అక్కాచెల్లెమ్మలంతా అండగా ఉండి వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. ఏపీఎం పుష్పావతి మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత ద్వారా నాలుగేళ్లలో ఒక్కో మహిళకు రూ.75 లబ్ధి చేకూరిందని చెప్పారు.



మహిళలకు వైఎస్సార్ చేయూత మెగా చెక్కును అందజేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్ష, ఇంచార్జి డా.సతీష్

బాబు మాయ మాటలు నమ్మి మోసపోకండి

14ఏళ్ల పాలనలో ఏనాడు చంద్రబాబు చెప్పుకునే విధంగా ప్రజలకు ఒక సంక్షేమ పథకాన్ని అమలు చేయలేదని కోట్ల హర్ష, డాక్టర్ సతీష్ విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో బాబు మాయ మాటలు, బూటకపు హామీలిస్తూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని, గత ఎన్నికల్లో మాదిరిగానే ఈ ఎన్నికల్లో కూడా బాబుకు తగిన బుద్ధి చెప్పాలని వారు మహిళలకు పిలుపునిచ్చారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

వైఎస్సార్ చేయూత నాల్గవ విడత కింద కోడుమూరు మండలంలోని 4,778మంది లబ్దిదారులకు మంజూరైన రూ.8.96కోట్ల మెగా చెక్కును స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కోట్ల హర్ష, డాక్టర్ సతీష్ మహిళలకు అందజేశారు. మహిళలు సంతోషం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అదేవిధంగా సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచు శ్రీనివాసరెడ్డి, మాజీ ఉపసర్పంచు ప్రవీణ్‌కుమార్, వైస్ ఎంపీపీ మాధవి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, రాఘవేంద్ర, వెంకటేష్, శివశంకర్, ప్రసాద్, బందెనవాజ్, ఎంపీటీసీ మణి, వార్డు మెంబర్లు, మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్ష, ఇన్‌చార్జ్ డా.సతీష్

హోరాహోరీగా సాగిన క్రీడా పోటీలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో శ్రీ నాగలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామ పెద్దలు క్రీడా పోటీలను ప్రారంభించారు. పరుగుపందెం, స్లోబైక్ రైడింగ్ పోటీలను మండల కో ఆప్షన్ సభ్యుడు దౌల ప్రారంభించగా గ్రామ స్థాయి ఎద్దుల బండలాగు, కబడ్డీ పోటీలను స్థానిక వైఎస్సార్సీపీ నాయకుడు ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. క్రీడీ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఆయా క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు దాతల చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో రమావెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, మాదవస్వామి, రామచంద్ర, తిరుమలరెడ్డి, అశోక్‌కుమార్,పోలీసు మధుమోహన్, బారికె సుంకన్న, గోపాల్, ఆటో శివ,తదితరులు పాల్గొన్నారు.



చనుగొండ్లలో ఎద్దుల బండలాగు పోటీలను ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో డాక్టర్ ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, తదితరులు

కర్నూలు సిటీ: గూడూరు మండల పరిధిలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు ఆదివారం కర్నూలు నగరంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పెంచికలపాడు గ్రామానికి చెందిన భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో పింజరి బజారి, గోరంట్ల, మాదన్న, సుంకన్నలతో పాటు 100 మంది కార్యకర్తలకు పార్టీ కోడుమూరు నియోజవర్గ ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డిలు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని, అందుకే ఎన్నికల్లో తమ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వలన మేలు జరిగి ఉంటేనే మద్దతు ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధైర్యంగా అడుగుతున్నారన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటాం

- విష్ణు రౌడీయిజం చేయాలని చూస్తే సహించం
- కోడుమూరులో హ్యాట్రిక్ విజయం సాధిస్తాం
- అభివృద్ధిని అడ్డుకునే వారికి గుణపాఠం చెప్పాలి
- కార్యకర్తల సమావేశంలో కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలో ఏ ఒక్క కార్యకర్తకు కష్టం వచ్చినా ముందుండి ఆదుకుంటామని, ప్రతి కార్యకర్తను కుటుంబ సభ్యుడిగా చూస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని పసుపులలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. కూడా చైర్మన్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విష్ణువర్ధన్ రెడ్డి రౌడీయిజం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ఎవరినైనా భయపెట్టడం, రౌడీయిజం చేయడం, అభివృద్ధిని అడ్డుకోవడం మంచిది కాదన్నారు. సొంత గ్రామాన్ని పట్టించుకోని నాయకులు, కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని వారు నియోజవర్గాన్ని అభివృద్ధి చేస్తామంటే ఎలా నమ్మాలి? అని ప్రశ్నించారు. కోడుమూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ గడ్డ అని, రాబోయే ఎన్నికల్లో మూడో సారి పార్టీ అభ్యర్థిని గెలిపించి హ్యాట్రిక్ సాధించి, జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దామని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిందని ఇన్‌చార్జ్ డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. వైఎస్సార్‌సీపీ మినహా మిగిలిన పార్టీలన్నీ ప్రజలకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. ప్రతి కార్యకర్తకు ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటానని, అర్ధరాత్రి అయినా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. పార్టీ కోసం కార్యకర్తలందరు కలిసి కట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మహబూబ్ బాషా, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, మౌలాలి, వైస్ ఎంపీపీ నెహిమియా, మాజీ వైస్ ఎంపీపీ డి.వాసు, ఎంపీటీసీ కృష్ణ, రామ్మోహన్ రెడ్డి, వెంకటరాముడు, ఎల్లమ్మ ఆలయ ట్రస్టు చైర్మెన్ మహేశ్వరరెడ్డి, పి.రుద్రవరం సర్పంచ్ వెంకటేశ్వర్లు, రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కూడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి

ముగిసిన పాణికేశ్వరుడి ఉత్సవాలు

పాణ్యం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రారంభమైన పాణికేశ్వరుడి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి.చివరి రోజు ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దర్శనం కోసం భక్తులు బారులుదీరారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం కళాకారుల చెక్కభజన ప్రజలను ఆకట్టుకుంది. ఉత్సవమూర్తులైన శ్రీ పాణికేశ్వరస్వామి, పార్వతీదేవిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. వేడుకను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈఓ సువర్ణ మాట్లాడుతూ మూడు రోజులుగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించామన్నారు.



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం



చెక్కభజనను తిలకిస్తున్న ప్రజలు

రమణీయం.. భోగేశ్వరుడి రథోత్సవం

గడివేముల: శ్రీ దుర్గాభోగేశ్వరుడి రథోత్సవం ఆదివారం రమణీయంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ రథానికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉత్సమూర్తులను వివిధ రకాల పుష్పాలతో అందగా ముస్తాబు చేసిన రథంపై అధిష్ఠింపజేశారు. రథం ముందు యువకులు చేసిన నందికోలు, కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అంతకుముందు స్వామివారికి అభిషేకం, ధూపదీప నైవేద్యములు, బలిహరణ వంటి పూజలు జరిపించాచారు. వేడుకను తిలకించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేలాది మంది భక్తుల కోలాహలం,కళాకారుల ప్రదర్శనల మధ్య రథాన్ని ముందుకు లాగారు. ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



భక్తుల జయజయ ధ్వానాల మధ్య సాగుతున్న భోగేశ్వరుడి రథోత్సవం

అనారోగ్యంతో విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

పాణ్యం: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత డ్రాయింగ్, అథ్లెటిక్ జాతీయ క్రీడాకారుడు కంబాల సంటెన్న (78) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శిష్యులు, బంధువుల తయన మృతదేహానికి నివాళులర్పించారు. నవోదయ కబడ్డీ అసోషియేషన్ సభ్యులు, పలువురు క్రీడాకారులు ఆయ మృతి పట్ల సంతాపం తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

సి.బెళగల్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఐదవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పెద్దఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. పాఠశాలలో ఉదయం జరిగిన ఐదవ తరగతి ప్రవేశ పరీక్షకు 1,012 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 73 మంది గైర్హాజరయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపల్ బలరాముడు తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశానికి 524 మందికి విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 49 మంది గైర్హాజరయ్యారన్నారు. చిన్నటేకూర్ గురుకుల పాఠశాల అధ్యాపకుడు రాత్‌మోహన్, సి.బెళగల్ ఎంఈఓ ఆదామ్‌బాషా పరీక్షల పరిశీలకులుగా వ్యవహరించారు. ఎస్‌ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును నిర్వహించారు.